ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

: fb.com/vaartha హైదరాబాద్

4-11-2022 శుక్రవారం సంపుటి : 28 సంచిక : 274, పేజీలు : 8+4 వెల : 6.50

epaper.vaartha.com WWW.VAARTHA.COM

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM


తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ. కాబట్టి ఈ రాక్షసుల కుట్రను బద్దలు కొట్టాం. విపక్ష పార్టీలను కూల్చే లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తున్నారు. దేశాన్ని సర్వనాశనం చేస్తామంటే ఎవరూ క్షమించరు.

-సిఎం కెసిఆర్



# నా ప్రభుత్వాన్నే.. కూలగొడతారా?

దేశంలో ప్రజాస్వామ్యం హత్య

4 ప్రభుత్వాలను పడగొడతామని సవాలు చేస్తారా?

దేశ న్యాయవ్యవస్థే కాపాడాలి.. చేతులెత్తి మొక్కుతున్నా..

జెపిలాంటి ఉద్యమాన్ని తీసుకొస్తాం

దేశం కోసం చావాల్సి వస్తే చస్తా..

బిజెపి ముఠాలను సహించబోమంటూ ఆగ్రహం వెలిబుచ్చిన సిఎం కెసిఆర్



గురువారం ప్రగతిభవన్‌లో మీడియాతో సిఎం కెసిఆర్

**రాష్ట్ర ప్రభుత్వాల కూల్చివేత కుట్రల విడియోలు బయటపెట్టిన సిఎం**

**భారత న్యాయ వ్యవస్థను చేతులెత్తి ప్రార్థిస్తున్నా. దయచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అర్థిస్తున్నా. సుప్రీంకోర్టు సీజే, హైకోర్టు సీజే, న్యాయమూర్తులు కూడా విడియోను పరిశీలించి ఇలాంటి వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలి. అందరం కలిసి యుద్ధం చేయాలి. దేశం కోసం చావాల్సి వస్తే చస్తా. జరుగుతున్న దమనకాండను దేశ ప్రజలు, యువత ముక్తకంఠతో ఖండించాలి.**

**-సిఎం కెసిఆర్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్3:** ఇప్పటి వరకు 8 రాష్ట్ర ప్రభుత్వాలను ఎలా కూలగొట్టారో,మరో 4 రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కూలగొట్టేందుకు బిజెపి ముఠాలు వేసిన పథకాలను టిఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బట్టబయలు చేశారు. తెలంగాణ, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్‌లో ప్రభుత్వాలు కూలగొడుతామని ఆ ముఠా సభ్యులు స్వయంగా చెప్పిన విషయాలకు సంబంధించి వీడియో ఫుటేజీను బయట పెట్టారు. దీన్ని రాజకీయం అంటారా? అక్కడ మౌనం పాటించారు కాబట్టి 8ప్రభుత్వాలు కూలిపోయాయి. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ కాబట్టి ఈ రాక్షసుల కుట్రను బద్దలు కొట్టామని సిఎం వివరించారు. విపక్ష పార్టీలను కూల్చే లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తున్నారని,దేశాన్ని సర్వనాశనం చేస్తామంటే ఎవరు క్షమించరని, ఈ వ్యవహారానికి సంబంధించిన ఫుటేజీని, ఇతర అధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. ఈ ఫుటేజీలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు, దేశంలోని అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు, అన్ని రాష్ట్రాల డిజిపీలకు, జాతీయ స్థాయి అన్ని మీడియా సంస్థలకు, సిబిఐ,ఐటీ, కేంద్ర విజిలెన్స్ వంటి రాజ్యాంగ బద్ద సంస్థలకు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు పంపించామన్నారు. మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ ముగిసిన తర్వాత గురువారం ప్రగతి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా మీడియాకు 70 నిమిషాలపాటు వీడియో ఫుటేజీలను ≫2



మర్రిగూడెంలో గురువారం ఓటెయ్యడానికి క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

# మునుగోడులో పోటెత్తిన ఓటు

## 92 శాతం పోలింగ్ నమోదు

చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

కొన్నిచోట్ల మొరాయించిన ఇవిఎంలు

ఓటు వేసేందుకు నిరాకరించిన రంగం తండా వాసులు

తనిఖీల్లో పట్టుబడ్డ మద్యం, డబ్బు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

**మునుగోడు, నవంబర్ 3 ప్రభాతవార్త:** మునుగోడు ఉపఎన్నిక చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నెమ్మదిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి ఊపందుకుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు మునుగోడు ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 2.40 లక్షల మందికి పైగా ఓటర్లు ఉండగా టిఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపిల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. ఈ ఉప ఎన్నికల బరిలో ప్రధాన పార్టీలైన టిఆర్‌ఎస్, బిజెపి, కాంగ్రెస్‌లతో పాటు మొత్తం 47 మంది అభ్యర్థులు ≫7



## డిసెంబర్ 1, 5న గుజరాత్ ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన ఇసి

ఈ సారి త్రిముఖ పోరు?

**గాంధీనగర్, నవంబరు 3:** గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. వచ్చే యేడాది ఫిబ్రవరి 18తో గుజరాత్ అసెంబ్లీ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇసి ≫2

# కమీషన్ల కోసమే ప్రాజెక్టులు

సన్నిహితుల మేలుకే సిఎం కార్యాచరణ

జాతిని జాగృతం చేసేందుకు భారత్ జోడో యాత్ర

శివంపేట సభలో రాహుల్ గాంధీ



పోతరాజులతో కలిసి కొరడాతో కొట్టుకొంటున్న రాహుల్ గాంధీ

**చౌటకూరు, నవంబరు 3, ప్రభాతవార్త:** భారతీయులను మతతత్వ, అవినీతికి ఆజ్యం పోస్తున్న పార్టీలు (బిజెపి, టిఆర్‌ఎస్)ల నుంచి జాగృతం చేసేందుకే భారత్ జోడో యాత్రను నిర్వహిస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలోని శివంపేటకు చేరుకున్న జోడో యాత్రను పురష్కరించుకుని ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బిజెపి పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థగా మారిందని ఆరోపించారు. ప్రధన మంత్రి నరేంద్ర మోడి తెచ్చిన నోట్ల రద్దు, జీఎస్టీలతో నిరుద్యోగ సమస్య ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెత్తందారులకు, ముఖ్యమంత్రి సన్నిహితులకు సహకారం అందేలా పాలన చేస్తున్నట్లు మండిపడ్డారు. తెలంగాణలో లక్షల రూపాయలు వ్యయం చేసి ఇంజనీరింగ్ చదువుకున్న వారు కూలీ పనులకు వెళ్లాల్సిన దయనీయ స్థితి దాపురించిందని ≫2



సంగారెడ్డి జిల్లాలో గురువారం భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ, అజారుద్దీన్, గీతారెడ్డి



బండి సంజయ్‌ని అరెస్టు చేసి తరలిస్తున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు

# బండి అరెస్టు, విడుదల

మునుగోడు దారి ఉద్రిక్తం.. రోడ్డుపై బైఠాయించి కార్యకర్తల ఆందోళన

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 3 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచార సమయం ముగిసినప్పటికీ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు మునుగోడు నియోజకవర్గంలో బసచేసి ఓటర్లను ప్రలోభపెడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుధవారం అర్థరాత్రి తర్వాత మునుగోడు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు బండి సంజయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేసారు. బండి సంజయ్ తన అనుచరులతో కలిసి వెళుతున్న సమయంలో పోలీసులు అతని వాహనాన్ని పనామా చౌరస్తావద్ద అడ్డుకునే ప్రయత్నం చేయగా అప్పటికే వందలాది మంది బిజెపి కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో బండిసంజయ్ పోలీసులనుండి తప్పించుకుని విజయవాడ జాతీయరహదారిపై మునుగోడు వైపు బయలుదేరారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు విజయవాడ జాతీయ రహదారిపై ≫7



ప్రముఖ పాత్రికేయుడు వరదాచారి ఇకలేరు

7లో



సీనియర్ జర్నలిస్టు కెఎల్ రెడ్డి కన్నుమూత

6లో

## పాక్ మాజీప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌పై కాల్పులు



కాలికి గాయం, నిందితుడి అరెస్ట్

ఘటనను ఖండించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

**వజీరాబాద్:** పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్(పిటిఐ) అధ్యక్షుడు, మాజీప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌పై కాల్పులు జరిగాయి. దేశంలో ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌తో కొనసాగిస్తున్న లాంగ్ మార్చ్ ర్యాలీ వజీరాబాద్‌లోని అల్లాహో చౌక్‌కు చేరుకోగా..ఇమ్రాన్‌ఖాన్ కంటెయినర్‌పై దుండగులు కాల్పులు జరిపారు. ర్యాలీలో ప్రజలనుద్దేశించి మాట్లాడేందుకు ఖాన్ కంటెయినర్‌పైకి ఎక్కి నిలబడిన సమయంలో కాల్పులు జరిగాయి. ఖాన్ కాలికి గాయాలైనట్లు పిటిఐ నేత పవాద్ చౌధురి తెలిపారు. తీవ్ర గాయాలేమీ కాలేదని తెలిపారు. ఖాన్‌ను లాహోర్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇమ్రాన్‌ఖాన్‌పై కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు.ఇమ్రాన్‌ను కంటెయినర్ నుంచి కారులోకి మార్చేటపుడు ఆయన కుడి కాలికి బ్యాండేజీ కట్టిన దృశ్యాలు కనిపించాయి. కాల్పుల సమయంలో ఆయన వెంట ఉన్న పిటిఐ నేతలు, కార్యకర్తలకు ≫2

# రక్తం చిందిన రోడ్లు

## రెండు వేర్వేరు ప్రమాదాల్లో 9 మంది మృతి



వికారాబాద్ జిల్లా ధారూరు మండలం బాచారం సమీపంలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పి కోటిరెడ్డి

వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీ కొన్న లారీ

ఐదుగురు మృతి

ఆరుగురికి తీవ్రగాయాలు

సంగారెడ్డి జిల్లాలో కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నలుగురు మృతి

2లో



సంగారెడ్డి జిల్లా అందోలు మండలం రాంపానిపల్లి శివారులో కారును ఢీక్నొ ఆర్టీసీ బస్సు



# అయ్యన్నపాత్రుడు, కుమారుని అరెస్టు

**ఇంటి ప్రహరీగోడ వివాదం, ఫోర్జరీ పత్రాల ఆరోపణ**

**తలుపులు పగులగొట్టి ఇంటిలోకి వచ్చిన పోలీసులు**

**కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి**

**విశాఖపట్నం, నవంబరు 3, ప్రభాతవార్త:** టిడిపి మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు, ఆయన తనయుడు రాజేష్‌ను ఎపి సిఐడి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో దొంగల్లా గోడ దూకి వచ్చి తలుపులు పగలగొట్టి ఇంటి లోపలికి ప్రవేశించారు. అయ్యన్న ఇంటి ప్రహారీ ఇరిగేషన్ శాఖ స్థలంలో నిర్మించిన సంఘటనతో పాటు ఫోర్జరీ పత్రాలు సమర్పించి గోడ కట్టారనే ఆరోపణలపై వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గతంలో అయ్యన్న పాత్రుడి నివాసం దగ్గర ప్రహారీ గోడ విషయంలో వివాదం రేగింది. అయ్యన్న పంట కాలువ (ఇరిగేషన్ శాఖకు చెందిన) స్థలాన్ని ఆక్రమించి గోడ కట్టారని కూల్చివేతకు అధికారులు సిద్ధమయ్యారు. కానీ అయ్యన్న కుటుంబ సభ్యులు అడ్డుకోవ డంతో ఉద్రిక్త పరిస్థితులుఏర్పడ్డాయి. అనంతరం హైకోర్టులో పిటిషన్ వేయగా అయ్యన్న కుటుంబానికి ఊరట దొరికింది. మళ్లీ అదే కేసులో ఫోర్జరీ డాక్యుమెంట్లు కోర్టుకు సమర్పించారనే అభియోగాలపై అయ్యన్న పాత్రుడితో పాటు కుమారుడు రాజేష్‌ను సిఐడి పోలీసులు అరెస్ట్ చేయడం ఆసక్తికరంగా మారింది. గురువారం తెల్లవారు జామునే ఏలూరు, రాజమండ్రి, అమరావతి, విశాఖ ప్రాంతాల సిఐడి పోలీసులు నర్సీపట్నంలోని అయ్యన్న ఇంటి వద్దకు భారీ చేరుకున్నారు. అయ్యన్న పాత్రుడు, రాజేష్‌ను విశాఖ సిఐడి కార్యాలయానికి తరలించారు. సింహాచలం పీహెచ్‌సీలో అయ్యన్న, ఆయన కుమారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫోర్జరీ పత్రాలకు సంబంధించి రాజమండ్రిలో అయ్యన్న కుటుంబంపై ఫిర్యాదు అందడంతో విచారణాధికారులు అక్కడ నుంచి రెండ్రోజులుగా నర్సీపట్నంలో రెక్కీ నిర్వహించారని తెల్సింది. తొలుత నోటీసులు అందజేసి ఆ తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతున్నారు. అయ్యన్నపై పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

**హైకోర్టులో విచారణ నేటికి వాయిదా**

అయ్యన్న పాత్రుడు,ఆయన కుమారులపై మధ్యంతర ఉత్తర్వు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ, కేసు డైరీ చూసిన తరువాతనే తగిన నిర్ణయం తీసుకుం టామని న్యాయస్థానం స్పష్టం చేసింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అయన్న, ఆయన కుమారులు రాజేష్ అరెస్టుకు సంబంధించి దాఖలైన లంచ్‌మోషన్ పిటీషన్‌పై నేటి మధ్యాహ్నం హైకోర్టు విచారణను చేపట్టింది. పిటిషనరుల తరుపు న్యాయవాదులు అచ్చెన్న, రాజేష్‌ల అరెస్టుపై సీఐడీ అత్యుత్సాహం చూపించిందని, నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ చేసారని కోర్టుకు తెలిపింది. ఈ అరెస్టులపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును కోరారు. అయితే కేసు డైరీన పరిశీలించిన తరువాతే మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం తీసుకుంటామని ఎపి హైకోర్టు తెలిపాంది. శుక్రవారం ఉదయం 10.30 కల్లా కేసు డైరీ తమ ముందు ఉంచాలని సిఐడి హైకోర్టు ఆదేశించింది. నిందితులపై పెట్టిన కేసులు చెల్లుబాటు కావన్నారు.

# యుద్ధ సంక్షోభంతో బొగ్గుకు డిమాండ్ అధికం

**● ఇండియా కోల్ సదస్సులో సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్**

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులతో యూరప్, ఆసియా దేశాల్లో తీవ్ర చమురు కొరత ఏర్పడిందని, దీనికి ప్రత్యామ్నాయ ఇంధనంగా బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిందని సింగరేణి కాలరీస్ డైరక్టర్ ఎస్ చంద్రశేఖర్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి సంస్థలు తమ లక్ష్యాలను పెంచుకుని అధిక ఉత్పత్తిని సాధించాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. గ్లోబల్ కోల్ సెక్టార్ ఆధ్వర్యంలో ఢిల్లీలో గురువారం ప్రారంభమైన 4వ వార్షిక ఇండియా కోల్ సదస్సులో 'మారుతున్న బొగ్గు అవసరాలు, ఉత్పత్తి సంస్థల కర్తవ్యం' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న నేపథ్యం లో క్రమంగా బొగ్గు ఉత్పత్తిని పలు దేశాలు కుదించుకుంటున్నాయని తెలిపారు. అయితే యూరప్‌లో నెలకొన్న యుద్ధ సంక్షోభం వల్ల చమురు సరఫరాలో విఘాతం ఏర్పడి విద్యుత్ ఉత్పత్తి సంస్థలు బొగ్గు వైపు మళ్లాయని, దీంతో దీనికి పెద్ద ఎత్తున డిమాండ్ పెరిగిందన్నారు. విదేశీ బొగ్గును అధిక ధరలకు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో దేశంలోని పరిశ్రమలు స్వదేశీ బొగ్గు వైపు దృష్టిసారించడం వల్ల దానికి తీవ్రమైన డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

సింగరేణి కాలరీస్ అత్యాధునిక పర్యావరణహిత మైనింగ్ పద్ధతులు అవలంబించడంతో పాటు, బొగ్గు రవాణాకు సొంతంగా రెండు చోట్ల రైల్వే మార్గాలను నిర్మించుకుని, పెద్ద ఎత్తున గ్రీనరీని చేపట్టిందని వెల్లడించారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో డీజిల్ డంపర్ల వినియోగాన్ని తగ్గించేందుకు ఎక్కువ గనుల్లో బెల్ట్ ద్వారా బొగ్గు రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

దేశ, రాష్ట్ర అవసరాలరీత్యా ప్రతీ యేటా సింగరేణి తన ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ 65 మిలియన్ టన్నుల స్థాయికి చేరిందని చెప్పారు. ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల లక్ష్యా లను కలిగి ఉన్నామని వివరించారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా సింగరేణిలో కొత్త ఓసి గనులతోపాటు, ఒడిశా రాష్ట్రంలో తొలిసారిగా నైనీ బ్లాక్‌ను చేపట్టామని, ఈ నేపథ్యం లో మరో నాలుగేళ్లలో 100 మిలియన్ టన్నుల మైలురాయి దాటాలన్న లక్ష్యంతో ముందు కు వెళుతున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్య దర్శి ఎం నాగరాజు, దామోదర్ వ్యాల కోల్ ఫీల్డ్స్ ఛైర్మన్ రఘురాం తదతరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సేవల్లో లోపాలు ఉంటే ఫిర్యాదు చేయండి

**● సిజిఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్లు జయరాజ్, దిలీప్**

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థ అందిస్తున్న సేవల్లో లోపాలు ఉంటే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగ దారుల పరిష్కార వేదిక (సిజిఆర్‌ఎఫ్) ఛైర్‌పర్సన్లు జయరాజ్, దిలీప్ కుమార్‌లు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్క రించుకుని హైదరా బాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్‌ఎస్పీ డీసీఎల్) కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్స వం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్లు మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాలను చేశాయన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతా సర్కిళ్లు మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక పనిచేస్తున్నాయని చెప్పారు. మీటరుకు సంబం ధించిన సమస్యలు, నూతన సర్వీసుల మంజూ రులో జాప్యం, పేరు, కేటగిరి మార్పు, బిల్లింగ్‌లో పొరపాట్లు, విద్యుత్ సర్వీస్ రీకనెక్షన్ నిర్ణీత సమ యంలో విద్యుత్ పునరుద్ధరణ చేయకపోవడం వంటి సమస్యలపై తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఫిర్యాదు అందిన 10 నుండి 45 రోజుల్లో వాటి పరిష్కారానికి సంబంధించిన తుది తీర్పును వెల్లడిస్తామని వివరించారు. విద్యుద్ అంబుడ్స్‌మన్ మహ్మద్ నిజాముద్దీన్ మాట్లాడుతూ కొంత మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలిపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై క్షేత్ర స్థాయి సిబ్బందికి తగు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంతో పోల్చితే విద్యుత్ అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడిందన్నారు. ఎస్పీడీసీఎల్ సిఎండి రఘుమారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించేందుకు పలు చర్యలు చేపట్టామన్నారు. పంపిణీ వ్యవస్థ పటిష్టత కోసం 18,624 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు




తెలిపారు. కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సంస్థకు చెడ్డ పేరు తెచ్చేదిగా ఉంటోందని, వినియోగదారులతో దురుసుగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు టి శ్రీనివాస్, కె రాములు, ఎస్ స్వామిరెడ్డి, జె శ్రీనివాస్, సిహెచ్ మదన్‌మోహనరావు, గోపాల్, సిజీఎం లు పాండ్య, నరశింహస్వామి, ఎస్ఇలు, డిఇలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ జర్నలిస్ట్ వరదాచారి ఇకలేరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** సీనియర్ జర్నలిస్ట్ జిఎస్ వరదాచారి గురువారం ఆసుపత్రికి తరలిస్తుండగా కన్ను మూశారు. గత కొన్ని రోజులుగా వయోభారంతో బాధపడుతున్న ఆయన ప్రశాంతంగా కన్నుమూశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పంజాగుట్ట స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరుగనున్నాయి. జిఎస్ వరదాచారి 1932 అక్టోబర్ 15న నిజామాబాద్‌లోని ఆర్మూర్‌లో జన్మించారు. 1954లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ చదివారు. అదే యూనివర్సిటీ నుంచి 1956లో జర్నలిజంలో పీజీ డిప్లమా చేశారు. 1959లో అదే యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బి చేశారు. 1948లో ఆంధ్ర జనతాలో తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. తెలుగు భాషా సినీవిమర్శకుడిగా, పాత్రికేయుడుగా ఆయన 1988లో పదవీవిరమణ చేశారు. ఆయన ఈనాడులో, ఆంధ్రభూమిలో పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్యకు అధ్యక్షుడిగా పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వెటరన్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. వరదాచారి మృతి పట్ల సిఎం కెసిఆర్ సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దాలపాటు జర్నలిజం రంగానికి సేవలందించారని సిఎం అన్నారు. వారి కుటుంబసభ్యులకు సిఎం కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# బండి అరెస్టు, విడుదల

≫ బలగాలను మోహరించి అబ్దుల్లాపూర్‌మెట్ వద్దకు రాగానే పోలీసులు బండి సంజయ్ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో విజయవాడ రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బిజెపి కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దీంతో పోలీసులు బండిసంజయ్‌ను అదుపులోకి తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఉన్నాడనే విషయాన్ని తెలుసుకున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ వద్దకు రావడంతో పోలీసులు ఉదయం 7.30 గంటల ప్రాంతంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌నుండి తరలించి బిజెపి రాష్ట్ర కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మునుగోడు ప్రజలు కెటిఆర్ ఆరాచకాలను గుర్తించి మునుగోడులో గుణపాఠం చెప్పాలన్నారు. రాక్షస పాలనను అంతమొందించాలంటే టిఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.



# మంగోలియాలో మేఘా గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ నిర్మాణం

**790 మిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టును దక్కించుకున్న తెలుగు సంస్థ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** దేశ, విదేశాల్లో భారీ ప్రాజెక్టులను చేపట్టి రికార్డు సమయంలోనే అలవోకగా పూర్తి చేస్తున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థకు మంగోలియా గడ్డపై మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్మించే పనులు దక్కాయి. మంగోళియా దేశంలోనే మొట్టమొదటి చమురు శుద్ధికర్మాగారాన్ని నిర్మించేందుకు ఉద్దేశించిన మంగోల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు కోసం ఎల్ఓఎ(లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్సీ)ని మేఘా అందుకుంది. ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) ఒప్పందం పద్ధతిలో ఈ కొత్త రిఫైనరీ మంగోలియాలో ఎంఇఐఎల్ నిర్మించనుంది. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఇఎ) డెవలప్‌మెంట్ పార్టనర్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ చొరవతో, భారత ప్రభుత్వం ఆర్థిక సహాయ సహకారాలతో మంగోలియా దేశం ఈ భారీ గ్రీన్ ఫీల్డ్ అయిల్ రిఫైనరీ ప్రాజెక్టును నిర్మించనుంది. ఈ జీ2జీ (ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి) భాగస్వామ్యం ప్రాజెక్టుకు ఇంజినీర్స్ ఇండియా (ఈఐఎల్), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్(పిఎంసీ)గా వ్యవహారించనుంది. ఈ ప్రాజెక్టు వల్ల సమీప ప్రాంతాల్లో చిన్న పరిశ్రమల వృద్ధి గణనీయంగా పెరగనుంది. అంతేగాక, మంగోలియా దేశ ఆర్థిక అభివృద్ధి రేటు పెంపుదలకు ఇది ఎంతగానో దోహదపడనుంది.

అదనంగా అక్కడి స్థానిక ప్రజల ఉపాధి అవకాశాలు మెరుగుపడి యువతకు ప్రోత్సాహకరమైన భవిష్యత్ ఉండబోతుంది. ఇప్పటికే హైడ్రోకార్బన్ రంగంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ అద్భుతంగా రాణిస్తోంది. ఆఫ్‌షోర్, ఆన్‌షోర్ అయిల్ రంగంలో దేశంలోనే కీలక శక్తిగా ఎదిగింది. ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల భారతదేశం, మంగోలియా దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయి.

మంగోలియా ఆర్థిక పరిపుష్టితో పాటు అక్కడ ప్రజల జీవన విధానం మెరుగుదలకు ఈ నూతన ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడనుంది. ప్రస్తుతం మంగోలియా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ అయిల్ రిఫైనరీ ప్రాజెక్టు నిర్మాణంలో మంగోలియా చమురు కోసం రష్యాపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఈ రిఫైనరీ నుంచి రోజుకు 30,000 బ్యారెల్స్, యేడాదికి 1.5 మిలియన్ టన్నుల ముడి చమురును ప్రాసెస్ చేయవచ్చు.

# మునుగోడులో పోటెత్తిన ఓటు



≫ ఉన్నారు. ఉప ఎన్నికలకు 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసి పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 5 వేల మంది పోలీస్ సిబ్బంది, 199 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను, పోలింగ్ నిర్వహణ కోసం 1192 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్‌తో కలిసి మొత్తం 50 బృందాలు పర్యవేక్షించారు. ఒక్కో పోలింగ్‌బూత్‌లో మూడు ఇవిఎంల చొప్పున ఏర్పాటు చేశారు. ఇవిఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య వస్తే పరిష్కరించడం కోసం 28 మంది బిహెచ్ఇఎల్ ఇంజినీర్లను అధికారులు సిద్ధం చేశారు. బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని స్వయంగా పరిశీలించారు. ఉదయం మునుగోడులోని శివాలయంలో రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఉదయం నుండి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు క్యూ కట్టి వ్యవసాయ పనులు, కూలీ పనుల కోసం వెళ్లేవారు ఉదయమే వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఓటర్లకు మంచినీటి సౌకర్యం కల్పించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత కూడా ఓటు వేసేందుకు క్యూలైన్‌లలో ఉన్న వారికి అధికారులు అవకాశం కల్పించారు. 2018 ఎన్నికల్లో 91.38 శాతం ఓటింగ్ నమోదవ్వగా ఓటర్ల సంఖ్య కూడా పెరగడంతో భారీగా పోలింగ్ నమోదయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గట్టుప్పల్ పట్టణ కేంద్రంలోని అధికార పార్టీ నేత బుడిగ వెంకన్న ఇంట్లో రూ. 3.10 లక్షలను పంచుతున్నారనే సమాచారంతో ఎన్నికల అధికారులు దాడులు నిర్వహించి డబ్బులను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి గిరిబాబు తెలిపారు. చండూరులో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానికేతరులు ఉన్నారంటూ ఓ ఇంట్లో ఉన్న వారిని బిజెపి నేతలు తరిమికొట్టగా టిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆ పార్టీ నేతలతో వాగ్వాదానికి దిగారు. మర్రిగూడలో బిజెపి కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇతర జిల్లాల పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇతర జిల్లాల టిఆర్‌ఎస్ నాయకులు ఉన్నారని బిజెపి నేతలు ఆరోపించారు. అటు మర్రిగూడలో స్థానికేతరులు ఉన్నారని చెప్పినా పట్టించుకోవడం లేదని బిజెపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు లాఠీచార్జిచేసి వారిని చెదర గొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించట్లేదని పలుచోట్ల ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరిస్తున్నారు. గట్టుప్పల్ మండలం రంగం తండాలో గ్రామస్తులు ఎన్నికను బహిష్కరించారు. గ్రామంలో మౌలికవసతులపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఓటు వేయమని గ్రామస్తులు అంటున్నారు. మర్రిగూడ మండలం శివన్నగూడెం, చర్లగూడెం గ్రామంలో భూనిర్వాసితులు అర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇవ్వాలంటూ నిరసన వ్యక్తంచేస్తూ ఓటింగ్‌కు రావడం లేదు. దీంతో పోలింగ్ కేంద్రాలన్ని ఖాళీగా దర్శనమి స్తున్నాయి. ఇదిలా ఉంటే మునుగోడులో నాన్ లోకల్స్ ఉన్నారంటూ సిఇసికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కోటిరెడ్డి అనుచరుల వాహనంలో నోట్ల కట్టలతో పాటు టిఆర్‌ఎస్ పార్టీ జెండాలు దొరికాయి. మరోవైపు పైసలియ్యందే ఓటేయమని నాంపల్లి ఓటర్లు తెగేసి చెప్పినట్లు తెలుస్తుంది.

**చండూరులో టిఆర్‌ఎస్, బిజెపి కార్యకర్తల మధ్య గొడవ**

చండూరులో టిఆర్‌ఎస్, బిజెపి కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. నాన్ లోకల్ వాళ్లు డబ్బులు పంచుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేయడంతో గొడవ మొదలైనట్లు తెలుస్తుంది. దీంతో రెండు పార్టీల మధ్య వాగ్వాదం మొదలైంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీచార్జి చేశారు. విషయ o తెలుసుకున్న బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికేతరులను పట్టుకుని పోలీసులకు అప్పగించినా పోలీసులు వదిలేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. డబ్బులు పంచుతున్నా కూడా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మంత్రి ఇంచార్జిగా ఉన్న గ్రామంలో మద్యం, డబ్బు పట్టివేత**

మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రలోభాల పర్వం కొనసాగుతుంది. కొద్దిసేపటి క్రితం మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామంలోని బీసీ కాలనీ వద్ద మద్యం, నగదు పట్టుకున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు వాటిని పోలీసులకు అప్పగించారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంత్రిగా ఉన్న ఈ గ్రామంలో మద్యం బాటిళ్లు, నగదు పట్టుబడడం హాట్‌టాపిక్‌గా మారింది.

**మొరాయించిన ఈవీఎంలు**

నియోజకవర్గంలోని సంస్థాన్‌నారాయణపురం జడ్పీ పాఠశాలలోని 94, 96 పోలింగ్ బూత్‌లలో, మునుగోడు మండలంలోని కొంపల్లిలోని 145, చౌటుప్పల్ మండలంలో ఈవీఎంలు మొరాయించాయి. ఓ వైపు ఓటర్లు భారీగా బారులు తీరారు. గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తుందని ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మునుగోడు మండలం పలివెల గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. చండూరు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఐజి కమల్‌హాసన్‌రెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరి పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా తప్పిదాలు జరగకుండా తనిఖీలు చేశారు. ఈవీఎంలు ఎలా పనిచేస్తున్నాయో ఎన్నికల సిబ్బందిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**మునుగోడులో ఎన్నికల వ్యవస్థ ఫెయిల్: రాజగోపాల్‌రెడ్డి**

మునుగోడులో ఎన్నికల వ్యవస్థ ఫెయిల్ అయిపోయిందని బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడుకు ప్రజలకు కావాల్సింది అభివృద్దేనని అన్నారు. టిఆర్‌ఎస్ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ఓటర్లు ధర్మం వైపు నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారని రాజగోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రచారం ముగిసినా మంత్రులు బయటకు వెళ్లిపోకుండా ఇక్కడే ఉన్నారని డబ్బు, మద్యం పంచిపెడుతున్నారని ఆరోపించారు.

**చండూరులో సిరిసిల్ల జడ్పీ వైస్ ఛైర్మన్**

మునుగోడు బైపోల్‌లో ప్రలోభాలు, ఉద్రిక్తతలు కంటిన్యూ అవుతున్నాయి. విచ్చలవిడిగా డబ్బు, లిక్కర్ పంపిణీ జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిరిసిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ సిద్దం వేణు చండూరులో ఉన్నట్లు గుర్తించారు.

**మునుగోడులో ఆగని ప్రలోభాలు**

మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి మండలం టిపిగౌరారంలో టిఆర్‌ఎస్ ప్రలోభాలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలోనే భారీగా డబ్బున్న ఓ వాహనాన్ని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ వాహనం టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కోటిరెడ్డి అనుచరులదిగా అనుమానిస్తున్నారు. ఈ వాహనంలో నోట్ల కట్టలతో పాటు టిఆర్‌ఎస్ పార్టీ జెండాలు ఉన్నాయి.

**పైసలియ్యందే ఓటేయమన్న నాంపల్లి ఓటర్లు**

పైసలియ్యందే ఓటేయమని నాంపల్లి ఓటర్లు తెగేసి చెబుతున్నారు. ముఖ్యంగా వృద్దులు డబ్బుల కోసం ఎదురుచూశారు. పక్క కాలనీల్లో డబ్బులిచ్చి తమకెందుకు ఇవ్వరని స్థానిక నేతలను నిలదీస్తున్నారు.

**ఓటమి భయంతో దిగజారి వ్యవహరిస్తున్నారు: రేవంత్‌రెడ్డి**

మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ముఖ్యమంత్రి కెసిఆర్‌తో భేటీ అయ్యారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. పాల్వాయి స్రవంతి ఫోటోను మార్ఫింగ్ చేసి కెసిఆర్‌తో భేటీ అయ్యా రంటూ బిజెపి దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఓటమి భయంతోనే ఇలా దిగజారి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**బండి సంజయ్ హౌస్ అరెస్టు**

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో హౌజ్ అరెస్టు చేశారు. నిన్న రాత్రి మునుగోడుకు వెళ్తుండగా ఆయనను అదుపులోకి తీసుకుని పోలీసులు ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ నుండి పార్టీ ఆఫీస్‌కు తీసుకువచ్చారు. బండి అక్కడి నుండే మునుగోడు పోలింగ్ సరళిని, జరుగుతున్న పరిణామాలపై ఆరా తీస్తున్నారు. టిఆర్‌ఎస్ దాడులు, ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

**చండూరులో స్థానికేతరులు**

చండూరు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కరీంనగర్‌కు చెందిన టిఆర్‌ఎస్ నేతల మకాం వేశారు. స్థానిక బిజెపి నేతలు వాళ్లను పట్టుకునే ప్రయత్నం చేయగా వారు పరారయ్యారు. ఆ ఇంట్లో కరీంనగర్ టిఆర్‌ఎస్ నేతల ఆధార్ కార్డులు దొరికొనట్లు తెలుస్తుంది.

**మర్రిగూడ మండల కేంద్రంలో ఉద్రిక్తత**

మర్రిగూడ మండల కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల టిఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారని బిజెపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఓటర్లను ఇతర జిల్లాల టిఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రలోభపెడుతున్నారని మండిపడ్డారు. వారి వాహనాలను బిజెపి కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బిజెపి కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు.

**వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిస్థితిని గమనిస్తున్నాం: సీఈవో వికాస్‌రాజ్**

మునుగోడులోని 298 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ప్రకటించారు. రెండు పోలింగ్ స్టేషన్‌లలో ఈవిఎం బ్యాటరీల్లో సమస్య తలెత్తగా వాటిని సరిచేసినట్లు తెలిపారు. మునుగోడులో స్థానికేతరులు ఉన్నట్లు ఫిర్యాధు అందడంతో రెండు గ్రామాల్లో వారి నుండి డబ్బు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వికాస్‌రాజ్ చెప్పారు.

**ఫేక్ న్యూస్‌పై ఈసీకి పాల్వాయి స్రవంతి ఫిర్యాదు**

సీఎం కెసిఆర్‌ను కలిశానని తనపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతిరెడ్డి ఈసీకి ఫిర్యాధు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఫేక్ న్యూస్ క్రియేట్ చేశారని అందులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాల్వాయి స్రవంతి ఎన్నికల అధికారులను కోరారు.

**ఇడికుడలో ఓటేసిన పాల్వాయి స్రవంతి**

చండూరు మండలం ఇడికుడ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయ స్రవంతి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



తర్వాత చండూరులో పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ఈసీకి ఫిర్యాధు చేస్తానన్నారు. ప్రస్తుతానికి ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతుందని తెలిపారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న కూసుకుంట్ల**

నారాయణపూర్ మండలం లింగవారిగూడెంలో టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమన్నారు. ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**బుద్ధభవన్ నుండి ఓటింగ్ సరళి పరిశీలన**

మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సరళిని ఎన్నికల అధికారులు హైద్రాబాద్ బుద్ధభవన్ సీఈవో సెంట్రల్ ఆఫీస్ నుండి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే దగ్గర ఒక్కరి కన్నా ఎక్కువ మంది ఉన్న సెంటర్లను గుర్తించి పోలింగ్ బూత్ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. మునుగోడు పట్టణంలోని ఓ పోలింగ్ స్టేషన్‌లో జనం గుమికూడడంతో పీవోను అప్రమత్తం చేసిన అధికారులు వారిని అక్కడ నుండి పంపించాలని ఆదేశించారు.

**టిఆర్‌ఎస్ దాడులు, బెదిరింపులు పెరిగాయి: రాజగోపాల్‌రెడ్డి**

మునుగోడు బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. టిఆర్‌ఎస్ దాడులు, బెదిరింపులు పెరిగాయని ఆయన ఆరోపించారు. పోలింగ్ ఏజెంట్లను సైతం బెదిరిస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు.

**స్థానికేతరులను పట్టుకున్న బిజెపి కార్యకర్తలు**

నారాయణపురం మండలం పుట్టపాక పంక్షన్ హాల్‌లో స్థానికేతరులు ఉన్నట్లు ఎన్నికల పరిశీలకులు గుర్తించారు. సోదాలు నిర్వహించి వారి నుంచి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో లింగోజిగూడెంలో స్థానికేతరులు ఉన్నట్లు గుర్తించిన బిజెపి కార్యకర్తలు వారిని పట్టుకున్నారు.

**మాజీ ఎంపి వివేక్ వెంకటస్వామి పిఆర్‌వో అరెస్టు**

ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం నియోజకవర్గంలో ఉన్న స్థానికేతరుడైన మాజీ ఎంపి వివేక్ వెంకటస్వామి పిఆర్‌వో రమణారావును గురువారం మునుగోడు పట్టణంలో పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

# ఖరారైన ప్రధాని మోడీ పర్యటన

**నేడు బిఆర్‌కె భవన్‌లో సమావేశం**

**గోదావరిఖని, ప్రభాతవార్త:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రామగుండం పర్యటన ఖరారు అయ్యింది. ప్రధాన మంత్రి ఈ నెల 12వ తేదీ సోమవారం నాడు రామగుండంకు వచ్చి రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సిఎల్)ను జాతికి అంకితం చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం బూరుగుల రామక్రిష్ణ రావు (బిఆర్‌కె) భవన్‌లో బిఎంఓ ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారంపై చర్చించనున్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధిపతులను, పౌర సంబంధాల అధికారులను సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిసింది. ఆర్‌ఎఫ్‌సిఎల్ యూనిట్‌కు కూడా ఈ సమాచారం అందినట్లు విశ్వసీయ వర్గాల ద్వారా తెలిసింది. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ యూనిట్‌ను జాతికి అంకితం చేసేందుకు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్‌లోని విమానశ్రయంలో ప్రత్యేక విమానంలో వచ్చి అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా రామగుండం ఎన్టీపీసీకి రానున్నట్లు తెలిసింది.

# 11 సంఘాలు, అసోసియేషన్లకు ఒడి

**మూడేళ్ల ఒడిని ఒకేసారి ఇస్తూ సిఎస్ ఉత్తర్వులు**

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 11 సంఘాలు, అసోసియేషన్లకు అదర్ డ్యూటీ(ఒడీ) ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబం ధించిన జీవో ఆర్‌టీ నంబర్ 2060ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ గురువారం జారీ చేశారు. 11 సంఘాలు, అసోసియేషన్లకు 2020, 2021, 2022 క్యాలెండర్ సంవత్సరాలకు ఓడీ ఇస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. 11 సంఘాల్లో 6 ఉపాధ్యాయ సంఘాలే ఉండటం విశేషం. గుర్తింపు పెండింగ్‌లో ఉండటం.. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎస్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

